ఆత్మకూరు(ఎం)లో చేపట్టిన బీసీల మహాయాత్రలో పాల్గొన్న నాయకులు

చట్టసభల్లో బీసీలకు 60 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- ఆలిండియా ఓబీసీ జాక్ నాయకులు

ఆత్మకూరు(ఎం), మార్చి10 : సకల సామాజిక రంగాల్లో తాము ఎంతమంది ఉన్నామో అంత వాటా ఇవ్వాలని బీసీ సంఘాల ఉద్యమ నాయకులు ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. చట్టసభల్లో బీసీ వాటా సాధన కోసం ఆలిండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో 10 రోజులుగా కొనసాగుతున్న బీసీ మహాపాదయాత్ర ఆదివారం ఆత్మకూరు(ఎం)కు చేరింది. ఈ సందర్భంగా జాక్ నాయకులు తాయిని నరేందర్, మేకపోతుల నరేందర్, బత్తుల సిద్ధేశ్వర్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణం కోసం, తెలంగాణ సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన బీసీలంటే నేడు ఎవరికీ లెక్కలేదని, గత 70ఏండ్లుగా జనగణన కోసం, సమాన అవకాశాల కోసం బీసీలు ఎన్నో పోరాటాలు చేస్తున్నా పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. మహాత్మా జ్యోతిరావు పూలే, బెల్లి లలితక్క, మారోజు వీరన్న, శ్రీకాంతాచారి, సాంబశివుడు లాంటి వీరుల స్ఫూర్తితో ఉద్యమించి చట్టసభల్లో బీసీ వాటా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. చట్టసభల్లో వాటా సాధన కోసం 205 కిలోమీటర్ల దూరం పాదయాత్ర పూర్తి చేసి ఆత్మకూరు(ఎం)కు చేరుకున్నామని, చట్టసభల్లో బీసీల వాటా సాధనకు ప్రజాస్వామ్యంలో అత్యున్నత పోరాట రూపమైన పాదయాత్రను ఎంచుకున్నామని తెలిపారు. పాదయాత్రకు మేధావులు, బుద్ధిజీవులు, మహిళలు, విద్యార్థులు, యువత, కార్మికులు, కర్షకులు స్వాగతం పలుకడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పాదయాత్ర రాష్ట్ర నాయకుడు చాపర్తి కుమార్‌గాడ్‌గే, స్థానిక ఎంపీపీ తండ మంగమ్మ, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేశ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు బీసు చందర్‌గౌడ్, మండల నాయకులు నర్సయ్య, మురళి, వెంకన్న, ఆంజయ్య, మల్లేశ్, ఏలేందర్, ఐలయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు నల్ల చంద్రస్వామి, నీడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీశైలం పాల్గొన్నారు.

గజ్జెల రామకృష్ణకు సన్మానం

రామకృష్ణను మెమెంటోతో సత్కరిస్తున్న నందిని సిధారెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 10 : హైదరాబాద్‌కు చెందిన పీచర సునీతారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పోచంపల్లిలో కవితల పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన పట్టణానికి చెందిన ప్రముఖ కవి గజ్జెల రామకృష్ణను ఘనంగా సన్మానించి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి, కాళోజీ అవార్డు గ్రహీత అమ్మంగి వేణుగోపాల్, తెలంగాణ కల్చర్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ప్రముఖ విమర్శకుడు కాసుల ప్రతాపరెడ్డి, కేపీ అశోక్‌కుమార్, సాహితీవేత్త విహారి, వేముగంటి మురళీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ రవీందర్‌రావు, ఫౌండేషన్ చైర్మన్ విజయేందర్‌రావు, పురస్కార కమిటీ కన్వీనర్ కాంచనపల్లి గోవర్ధనరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆలేరు రూరల్, మార్చి 10 : మండలంలోని కొల్లూరులో 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సత్కరించారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజయ్య, దయాకర్‌రెడ్డి, మిస్కిన్, రాంరెడ్డి, దామోదర్, పూర్వ విద్యార్థులు రమేశ్, రామాచారి, రవీందర్, కవిత, మహేశ్వరి, శ్రీలత పాల్గొన్నారు.

బీబీనగర్ : భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపీసీ 1988– 1990 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల పరిధిలోని ఓ రిసార్టులో నిర్వహించారు. పూర్వ విద్యార్థులు, బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు సుదగాని హరిశంకర్ గౌడ్, మాజీ సర్పంచ్ భీమగాని రాములు, ఆంజనేయులు, మల్లేశం, ఫణీందర్, నర్సింహ యాదవ్, ఇంతియాజ్ అలీ, మహేశ్, నాగేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రదీప్ కన్నా, సత్తిరెడ్డి, దుర్గాబాయి, అరుణ, శ్రీలత పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–5 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్, మహేందర్, వెంకటేశ్, మహేశ్, మంజూర్, శ్రీకాంత్, నాగచందర్, శ్రీకాంత్, మధు, మమతారెడ్డి, షమీమ్‌బేగం పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 18 గొర్రెలు మృతి

వలిగొండ, మార్చి10 : కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని అక్కంపల్లి గ్రామ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రేగు బీరప్ప అక్కంపల్లి గ్రామ పరిధిలోని వెంచర్‌లో 6 నెలల క్రితం గొర్రెలకు దొడ్డిని ఏర్పాటు చేసి మందను అక్కడే ఉంచుతున్నాడు. యజమాని రేగు బీరప్ప ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో అన్నం తినేందుకు వలిగొండలోని తన ఇంటికి వచ్చిన సమయంలో గొర్రెల దొడ్డిలోకి దూరిన కుక్కలు గొర్రెలపై దాడి చేశాయి. దాడిలో 18 గొర్రెలు మృత్యువాత పడినట్లు బాధితులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

ఆర్థిక సాయం

రాజాపేట, మార్చి 10 : మండలంలోని జాల గ్రామానికి చెందిన మొగిలి సత్తెమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన జాల మైసమ్మ ఫౌండేషన్ సభ్యులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గంధమల్ల నర్సింహులు, నాయకులు ఇస్తారి, వెంకటయ్య, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, నర్సింహులు, ఠాకూర్ బీకం సింగ్, బాలకనకయ్య, గణేశ్ పాల్గొన్నారు.

మోత్కూరు, మార్చి 10 : మండలంలోని పాటిమట్లకు చెందిన పాడి రైతు కుటుంబానికి నార్మాక్స్ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన రైతు అయిలయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ.10వేలు అంద జేశారు. సొసైటీ డైరెక్టర్లు రఘుపతిరెడ్డి, నర్సిరెడ్డి, రాధాకిషన్‌రెడ్డి, వేతన కార్యదర్శి విజయ్‌రెడ్డి, సూపర్ వైజర్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

- బీజేపీ రాష్ట్ర నాయకుడు బూర నర్సయ్యగౌడ్

భువనగిరి సిటీ, మార్చి 10 : భారతదేశాన్ని ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు బూర నర్సయ్యగౌడ్ అన్నారు. ఆదివారం భువనగిరిలో జరిగిన భువనగిరి పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో అత్యంత ఆదరణ పొందిన దార్శనికుడు మోదీ అని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ మాట్లాడుతూ.. మోదీ హయాంలో అయోధ్య రామ మందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు, త్రిబుల్ తలాక్ రద్దు వంటి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ వీఎస్ఎస్ ప్రభాకర్, నాయకులు గంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, పానుగంటి పాపారావు, బందారపు లింగస్వామి, పాశం భాస్కర్ పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

- ముగిసిన మహా శివరాత్రి ఉత్సవాలు

ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

యాదగిరిగుట్ట, మార్చి10 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో భక్తుల కోలాహలం నెలకొన్నది. ఆదివారం సెలవుదినం కావడంతో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మాఢవీధులు, క్యూ కాంప్లెక్స్, తిరు మాఢవీధులు, గర్భాలయ ముఖ మండపంలోని క్యూలైన్లు సందడిగా మారాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు నారసింహస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. సుదర్శన నారసింహహోమం అనంతరం గజవాహన సేవ నిర్వహించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణోత్సవం జరిపారు. సుమారు గంటన్నరపాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి, దర్బార్ సేవలు నిర్వహించారు. స్వామివారిని సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.43,26,133 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలు పరిపూర్ణం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయమైన పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు పరిపూర్ణం అయ్యాయి. ఆరు రోజులపాటు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం చివరి రోజు ఉదయం నిత్య హవనం, శివపంచాక్షరి జపం, నందీశ్వర పారాయణాలు, పంచసూక్త పఠనం, మూలమంత్ర జపాలు జరిపించారు. అనంతరం పూర్ణాహుతి, త్రిశూలతీర్థ కార్యక్రమాలను యజ్ఞబ్రహ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరమశివుడి ఆయుధమైన శూలాన్ని మంగళవాయిద్యాలతో శివాలయంలో ఊరేగింపు చేసి విష్ణుపుష్కరిణిలో త్రిశూలతీర్థ స్నానఘట్టం పూర్తిచేశారు. పార్వతీ పరమేశ్వరులను దివ్యమనోహరంగా అలంకరించి డోలారోహణ వేడుకలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామిని అనంత పద్మనాభ స్వామి కులశేఖరాళ్వార్ వంశస్థురాలు, ఆలయ వంశపారంపర్య చైర్మన్ తిరునాళ్ లక్ష్మీబాయి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు స్వామివారి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆమె ముఖ మండపంలోని కులశేఖరాళ్వార్ల విగ్రహానికి మొక్కారు.

యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల రథయాత్ర ప్రదర్శన

ఆత్మకూరు(ఎం) : నేటి నుంచి యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల విజయవంతం కోసం ఆలయ నమూనాతో తయారు చేసిన రథయాత్రను ఆదివారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ప్రదర్శించారు.

ఆత్మకూరు(ఎం) యాదగిరిగుట్ట ఆలయ నమూనా రథయాత్ర వాహనం

లక్కారం చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చెరువులను నింపే బాధ్యత ప్రభుత్వంపై ఉంది

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్, మార్చి 10 : చెరువులను నింపే బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం చౌటుప్పల్, తంగడపల్లి, లక్కారం చెర్వులను లెక్‌మెన్ ఆఫ్ బెంగళూరుగా పెరుగాంచిన ఆనంద్ మల్లిగంతోపాటు నిపుణులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొలుసుకట్టు చెరువులను నింపేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అలాగే చెరువులను సుందరీకరించి పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, పబ్బు రాజుగౌడ్, కొయ్యడ సైదులుగౌడ్, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహగౌడ్, బోయ దేవేందర్, మొగుదాల రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

నీర్నెములలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట, మార్చి10 : గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం మండలంలోని బాచుప్పల్, ఎన్నారం, పల్లివాడ, దుబ్బాక, మునిపంపుల, నీర్నెముల, బోగారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయనున్నట్లు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీటీసీలు తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, మడూరి జ్యోతి, ఏనుగు పుష్ప, గోగు పద్మ, నాయకులు సురిగిరెడ్డి మల్లారెడ్డి, గంగుల రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, బత్తుల కృష్ణయ్య, గుత్తా నర్సిరెడ్డి, కూనూరు సాయికుమార్, గోదాసు పృథ్వీరాజ్, వనం చంద్రశేఖర్, అక్రం, జమీరొద్దీన్, కక్కిరేణి విజయ్ పాల్గొన్నారు.

వలిగొండ వర్తక సంఘం అధ్యక్షుడిగా రమేశ్

వలిగొండ, మార్చి10 : వలిగొండ వ్యాపార, వాణిజ్య యజమానుల సంఘం పట్టణ కమిటీని ఆదివారం పట్టణ కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శివనాథుల రమేశ్ గుప్తా, ఉపాధ్యక్షుడిగా పన్నీరు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బెలిదె శ్రీనివాస్ గుప్తా, కోశాధికారిగా చిలుముల రాంరెడ్డితోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్ గుప్తా మాట్లాడుతూ.. వర్తక సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాన్నారు. కమిటీ సభ్యులను వర్తక సంఘం సభ్యులు యాస నర్సిరెడ్డి, గంజి నారాయణ, ములుగు నర్సయ్య, ములుపోజు చంద్రమౌళి, లింగస్వామి, యాదగిరి, గణేశ్, అమరేందర్, షరీఫ్ అభినందించారు.

మహిళలు హక్కుల కోసం ఉద్యమించాలి

-ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

సంస్థాన్‌నారాయణపురం, మార్చి10 : మహిళలు తమ హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని పుట్టపాకలో ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన మహిళా సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నట్లు గుర్తుచేశారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఐద్వా ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేసి హక్కులు సాధించుకున్నామని, భవిష్యత్‌లో మహిళల కోసం మరిన్ని ఉద్యమలు చేస్తామన్నారు. అలాగే పుట్టపాక గ్రామ ఐద్వా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా నడికుడి శైలజ, కార్యదర్శిగా జయమ్మతోపాటు 25 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అనూరాధ, ఎంపీటీసీ మర్రి వసంత, దోనూరి నిర్మల, యాదవరెడ్డి, దొంతగాని పెద్దులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

14లోగా పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 10 : వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుకు ఈ నెల 14 చివరి తేదీ అని, అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలని తాసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఓటు నమోదు కోసం ఎపిక్ కార్డు తప్పనిసరి అని అన్నారు. ఎపిక్ కార్డుతోపాటు డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్ జత చేయాలని, 2020 నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు.

జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్‌కు సన్మానం

భువనగిరి అర్బన్, మార్చి 10 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయం బొల్లారంలో ఆదివారం కవితా ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ రజనీప్రియ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ బండారు జయశ్రీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వల్లాల విజయలక్ష్మి, మర్రి జయశ్రీ, రాపోలు అరుణ, శ్రీదేవి, మిరియాల లలిత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

విరాట్ విశ్వకర్మ కమిటీ ఎన్నిక

రామన్నపేట, మార్చి10 : మండలంలోని ఇంద్రపాలనగరంలో విరాట్ విశ్వకర్మ గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెలకుర్తి నర్సింహాచారి, గౌరవాధ్యక్షులుగా వెలకుర్తి వెంకటాచారి, వెలకుర్తి జానాచారి, ఉపాధ్యక్షుడిగా వెలకుర్తి అశోక్, సహాయ కార్యదర్శిగా వెలకుర్తి వీరాచారి, కోశాధికారిగా గుంటోజు జనార్దనాచారి, గౌరవ సలహాదారు బాలరాజు, కార్యవర్గ సభ్యులుగా సుధాకర్, యాదగిరి, అనంతాచారి, రామాచారి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యాదగిరి, సత్తయ్య, చంద్రమౌళి, రమాచారి, పరిపూర్ణాచారి పాల్గొన్నారు.

వైద్య శిబిరం

వలిగొండ, మార్చి10 : మండలంలోని టేకులసోమారంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదిత స్వచ్ఛంద సేవా సంస్థ, సంధ్య డెంటల్ క్లినిక్, రాయల్ డయాగ్నస్టిక్ వారి సహకారంతో నిర్వహించిన శిబిరంలో దంత, షుగర్ సమస్య ఉన్న 100 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య శిబిరం నిర్వాహకులు చేగూరి మల్లేశం, కర్తాల శ్రీనివాస్, పాశం అలివేలు, చేగూరి జయమ్మ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

యాదగిరిగుట్ట, మార్చి10 : జాతీయ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదివారం ప్రారంభించారు. మండలంలోని చొల్లేరు, మర్రిగూడెం, రామాజీపేట, చిన్నకందుకూరులో ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర శ్రీశైలం, జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, ఎంపీటీసీలు కొక్కలకొండ అరుణ, ఎర్ర పోచయ్య, మాజీ సర్పంచులు పాల్గొన్నారు. అలాగే యాదగిరిగుట్ట శీలక్ష్మీనరసింహస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. కొండకింద పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ శంకరయ్య, తాసీల్దార్ వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భువనగిరికలెక్టరేట్ : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదివారం పట్టణ పరిధిలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుతో కలిసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తోటకూరి వెంకటేశ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తోటకూరి విజయలక్ష్మి, బాలమల్లేశ్ యాదవ్, మహేశ్‌యాదవ్, మేకల లింగస్వామియాదవ్, రాజుయాదవ్, అమర్, బాలూ యాదవ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

బొమ్మలరామారం : రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల సాధించడానికి నిరంతరం కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని మేడిపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహానని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమసమాజం, వివక్ష లేని అభివృద్ధి, సమన్యాయం వంటి అంశాలపై అంబేద్కర్ దార్శనికత ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో సింగిర్తి మల్లేశ్‌ముదిరాజ్, బోయిని నర్సింహ, మైలారం ఈశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకలు

ఆత్మకూరు(ఎం)లో మహిళా సమాఖ్య జెండాలను ఆవిష్కరిస్తున్న సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు రాజమణి

ఆత్మకూరు(ఎం), మార్చి 10 : అఖిల భారత మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రోడ్డుపై సంఘం జెండాను మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు గుర్రం రాజమణి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మంగమ్మ, వరలక్ష్మి, మౌనిక, ధనలక్ష్మి పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ సంఘం మండల నాయకులు

సావిత్రీ బాయి పూలేకు నివాళి

వలిగొండ, మార్చి10 : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో మండల బీసీ సంఘం, మండలంలోని లోతుకుంట కస్తూర్బాగాంధీ పాఠశాలలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సావిత్రీ బాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీరాందేవ్, బీసీ సంఘం మండలాధ్యక్షుడు సాయిని యాదగిరి మాట్లాడుతూ స్త్రీ విద్య కోసం కృషి చేసిన సావిత్రీ బాయి పూలేకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం పట్టణాధ్యక్షుడు రమేశ్, ఎమ్మార్పీస్ అధ్యక్షుడు రాంచంద్రం, బాలరాజు, శ్రీనివాస్, ప్రవీణ్, రాఘవేందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు : మహిళల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శనీయమని టీఎస్ యూటీఎఫ్ మండలాధ్యక్షుడు సత్తయ్య అన్నారు. ఆదివారం మోత్కూరులోని సంఘం కార్యాలయంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, సోమేశ్వర్, ఉప్పలయ్య, మల్లేశం పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వర స్వామి రథోత్సవం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 10 : పట్టణ కేంద్రంలో బుగ్గ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రథంపై పార్వతీపరమేశ్వరులను ప్రతిష్ఠించి పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భిక్షపతి, గౌరవ సలహాదారు యాదగిరి, ఉపాధ్యక్షులు అశోక్, భావనారుషి, ప్రధాన కార్యదర్శి ధనుంజయ, సహాయ కార్యదర్శి అయ్యన్న, కార్యదర్శి యాదగిరి, కోశాధికారి శ్రీరాములు, ధర్మకర్తలు పాల్గొన్నారు.